## క్లుప్తంగా

### జీప్యాట్-2024లో హిందూ ఫార్మసీ విద్యార్థుల ప్రతిభ

**గుంటూరు ఎడ్యుకేషన్:** ఎం.ఫార్మసీలో ప్రవేశానికై జాతీయస్థాయిలో నిర్వహించిన జీప్యాట్-2024 ఫలితాల్లో హిందూ ఫార్మసీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జీప్యాట్-2024లో ప్రవేశ పరీక్షకు తమ కళాశాల నుంచి హాజరైన 30 మంది విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారని, వీరందరూ ప్రముఖ విశ్వవిద్యాలయాలతో పాటు నైపర్‌లో తమకు నచ్చిన బ్రాంచ్‌లో ఎం.ఫార్మసీలో చేరేందుకు అర్హత పొందారని వివరించారు. షేక్ అఫ్రిన్ బేగం 3,186వ ర్యాంకు, బి.సంధ్యారాణి 8,213వ ర్యాంకు, ఏ. చెన్నకేశవ 10,745వ ర్యాంకు, బి. లక్ష్మీ శ్రావణి 11,213వ ర్యాంకు సాధించారని తెలిపారు. జీప్యాట్ ద్వారా ఎం.ఫార్మసీ చదివే విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ఉపకార వేతనాలు మంజూరు చేస్తుందని, ఎం.ఫార్మసీ పూర్తయిన తరువాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో ఉపాధి అవకాశాలు ఉంటాయని తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులను కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్. మధుసూదనరావు, జీప్యాట్ కోచింగ్ ఇన్‌చార్జ్ సీహెచ్ ప్రసాదరావు, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ పి.సీతారామయ్య, డాక్టర్ ఎ.ప్రత్యూష, అధ్యాపకులు అభినందించారు.

### తొలి బడ్జెట్‌లోనే ఏపీకి పెద్దపీట

**గుంటూరు మెడికల్:** అభివృద్ధి పథంలో ఆంధ్రప్రదేశ్ దూసుకెళుతుందని, డబుల్ ఇంజన్ సర్కార్ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి నాంది పలికిందని బీజేపీ గుంటూరు తూర్పు నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ తెలిపారు. మంగళవారం కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు గణనీయంగా నిధులు కేటాయించిందన్నారు. ఏపీ రాజధాని అమరావతి అభివృద్ధికై రూ.15 వేల కోట్లు కేటాయించిందని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన హామీలు అమలు చేస్తూ పోలవరం ప్రాజెక్ట్ పూర్తిచేసే బాధ్యతను కేంద్ర ప్రభుత్వం తీసుకోవడం హర్షణీయమన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు రాయలసీమ, ప్రకాశం జిల్లాలకు ప్రత్యేకంగా సహాయం చేసి అభివృద్ధి పథంలో ఆంధ్ర రాష్ట్రాన్ని ఆదుకుంటున్న కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా ఉందన్నారు. అంతర్జాతీయంగా భారతదేశ మ్యాను ఫ్యాక్చరింగ్ హబ్‌గా మారడానికి అడుగులు పడుతున్నట్లు వెల్లడించారు. బాబు షూరిటీ మోదీ గ్యారెంటీ నినాదాన్ని నమ్మి ఓటేసిన ఆంధ్రప్రదేశ్ ప్రజలకు మోదీ తొలి బడ్జెట్‌లోనే పెద్దపీట వేసి ఏ రాష్ట్రంలో లేనట్టుగా నిధులను కేటాయించారన్నారు.

### కలుపు మందుల అమ్మకాలు నిలిపివేత



**కొరిటెపాడు(గుంటూరు):** సంగడిగుంటలోని లాంచెస్టర్ రోడ్‌లో గల పల్నాడు పార్శిల్ సర్వీసులో గుంటూరు అర్బన్ వ్యవసాయ అధికారులు బి.గౌతం ప్రసన్న, ఒ.సునీల్‌లు మంగళవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో ఎటువంటి పత్రాలు లేకుండా హైదరాబాదు నుంచి వస్తున్న రూ.24,000 విలువ గల 150 లీటర్ల గ్లైసెల్ పురుగు మందుల(కలుపు మందు)ను స్వాధీనం చేసుకుని అమ్మకాలు నిలిపివేశారు. ఈ సందర్భంగా ఏఓలు మాట్లాడుతూ అనుమతులు లేకుండా విత్తనాలు, పురుగు మందులు రవాణా చేయడం నేరమన్నారు. సరైన పత్రాలు లేని కారణంగా స్వాధీనం చేసుకుని అమ్మకాలు నిలిపివేశామన్నారు. ఈ కలుపు మందుపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి తదుపరి నిర్ణయం తీసుకుంటామన్నారు.

### ఉరేసుకుని వ్యాపారి ఆత్మహత్య

**నగరంపాలెం:** గాలి పంకాకు ఉరేసుకుని వ్యాపారి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముత్యాలరెడ్డి నగర్ ఏడో వీధి పీవీఆర్ అపార్ట్‌మెంట్‌లోని ఓ ప్లాట్‌లో శ్రీహరిబాబు (55), ఆయన భార్య భాగ్యలక్ష్మీ ఉంటారు. వారికి అరండల్‌పేట ఐదో వీధిలో చెప్పుల దుకాణం ఉండగా, కోవిడ్-19 నుంచి దుకాణంలో రూ.25 లక్షల ఖరీదు చేసే సరుకు నిల్వ ఉంది. దీంతో కొద్ది నెలలుగా శ్రీహరిబాబు ఆరోగ్యం సరిగాలేక విజయవాడలో ఓ ఆసుపత్రిలో వైద్యం చేయించుకుంటున్నారు. సోమవారం అతని భార్య బంధువుల ఇళ్లకు వెళ్లింది. మంగళవారం భార్య భర్త ఫోన్‌కు చేయగా, లిఫ్ట్ చేయలేదు. దీంతో ఆమె అనుమానం వచ్చి ప్లాట్‌ల్లోని తెలిసిన వారికి ఫోన్ చేసింది. ప్లాట్‌కు తాళం వేసినట్లు చెప్పారు. ఇక ఆమె ప్లాట్ వద్దకు చేరుకుని తాళం తీయగా భర్త పంచెతో ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించగా విలపించింది. ఈమేరకు అరండల్‌పేట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని జీజీహెచ్ శవాగారానికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### యువతి అదృశ్యం

**గుంటూరు రూరల్:** యువతి అదృశ్యంపై నల్లపాడు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. సీఐ వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం ఎన్జీవో కాలనీ, 12వ లైను నల్లకుంటకు చెందిన రేపూడి సుమ ఈ నెల 21వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని తండ్రి రేపూడి ఎలీషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. యువతికి 20 సంవత్సరాలు ఉంటాయని, మతి స్థిమితం లేదని ఆచూకీ తెలిసిన వారు నల్లపాడు 8688831376, 8688831590 సెల్ నంబర్లకు తెలియజేయవచ్చన్నారు.

# దంపతుల్లో పెరుగుతున్న సంతానలేమి

- ఆధునిక జీవనశైలితో సమస్యలు
- సంతానం కోసం వైద్యులను సంప్రదిస్తున్న జంటలు
- అనుమతి ఉన్న ఐవీఎఫ్ కేంద్రాలకు వెళ్లాలని అధికారుల సూచన
- రేపు వరల్డ్ ఐవీఎఫ్ డే

పెళ్లి కాకముందు 'పప్పన్నం ఎప్పుడు పెడతావ్' అనడగుతారు. పెళ్లయిన తరువాత 'ఏమన్నా విశేషమా' అంటూ బంధువులు గుచ్చి గుచ్చి మరీ అడుగుతారు. వారి ప్రశ్నల్లోని అంతరార్థం.. ఇద్దరు-ముగ్గురు ఎప్పుడు అవుతున్నారని తెలుసుకునేందుకే. కానీ ఇవాళ నట్టింట్లో పిల్లలు నడయాడటం అన్నది దంపతులకు పెద్ద సమస్యగా మారింది. ఆలస్యంగా వివాహాలు కావడం, ఒత్తిడులు వంటివన్నీ ఈ సమస్యకు ఆజ్యం పోస్తున్నాయి. 'అమ్మతనం', అమ్మా-నాన్న అనే పిలుపుల కోసం ఎన్నో జంటలు ఆశగా ఎదురుచూస్తున్నాయి. ఎన్నో వైద్యశాలల మెట్లు ఆశగా ఎక్కి దీనంగా ఇంటిముఖం పడుతున్న ఘటనలు చాలా ఉంటున్నాయి.



**గుంటూరు మెడికల్:** అమ్మ అనే పిలుపు కోసం మహిళలు ఎంతగానో ఎదురు చూస్తుంటారు. ఆధునిక జీవనశైలి వల్ల నేడు సంతానలేమి సమస్యలు పెరిగిపోతున్నాయి. వివాహమై ఏళ్లు గడుస్తున్నా సంతానం కలుగక బాధపడుతున్నవారి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. సంతానలేమి సమస్యలు పెరిగిపోవటంతో వారికి వైద్యసేవలను అందించేందుకు ప్రత్యేక ఆస్పత్రులు, ఐవీఎఫ్ సెంటర్స్ గుంటూరులో నూతనంగా చాలా వచ్చాయి. మొట్టమొదటిసారిగా 1978 జులైలో యునైటెడ్ కింగ్‌డమ్‌లో ఐవీఎఫ్ ద్వారా లూయిస్ బ్రౌన్ బిడ్డకు జన్మనిచ్చింది. మొట్టమొదటి టెస్ట్‌ట్యూబ్ బేబీగా వరల్డ్ రికార్డు కెక్కింది. ప్రతి ఏడాది జులై 25న వరల్డ్ ఐవీఎఫ్ డేగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

**మగవారిలో సంతానలేమికి కారణాలు**

మగవాళ్లలో దీర్ఘకాలిక వ్యాధులైన బీపీ, షుగర్ సంతానలేమికి దారితీస్తోంది. స్మోకింగ్, ఆల్కహాల్, డ్రగ్స్, కొన్ని రకాల మందులు వాడటం వల్ల కూడా సంతానలేని సమస్య ఉత్పన్నమవుతుంది. సుఖవ్యాధులు, టీబీ, బీర్జాలకు గాయాలవ్వటం, దెబ్బలు తగలటం, అంగం సైజుల్లో తేడాలు, పని ఒత్తిడి వల్ల సంతానలేమి సమస్యలు వస్తున్నాయి.

**ఆడవారిలో పిల్లలు పుట్టకపోవటానికి కారణాలు..**

పెళ్లైన ఏడాది పాటు ఎలాంటి గర్భనిరోధక పద్ధతులు పాటించకుండా దాంపత్య జీవితాన్ని కొనసాగించినా గర్భం రాకపోవటాన్ని వంధత్వం (ఇన్‌ఫెర్టిలిటీ) అంటారు. ఆడవాళ్లలో సంతాన లేమికి కారణాల్లో ఆలస్యంగా అంటే 35 సంవత్సరాల వయస్సులో పెళ్లి చేసుకోవటం. ఆలస్యంగా రజస్వల అవ్వటం. అండం విడుదల అవ్వకపోవటం, హార్మోన్ల సమస్య, గర్భసంచి, కడుపులో ఇన్‌ఫెక్షన్లు, గర్భసంచి ట్యూబ్‌లు మూసుకుపోవటం, పీసీఓడీ, జునైటైల్ టీబీ, బీపీ, షుగర్, జీవనశైలి, అధిక మానసిక వత్తిడి, అధిక బరువు, అండం విడుదల జరిగే సమయంలో దాంపత్యంలో పాల్గొనకపోవటం, దాంపత్యం కోసం మూఢనమ్మకాలు పెట్టుకుని ఆచరించటం, సెక్స్‌పై అవగాహన లేకపోవటం ఇలా ఎన్నో కారణాలు లేకపోలేదు.

కంప్యూటర్‌ను 6 నుంచి 8 గంటలపాటు వినియోగించటం, రాత్రివేళల్లో ఎక్కువగా సెల్‌ఫోన్ మాట్లాడటం, వీర్యకణాలు తక్కువగా ఉండటం, రాత్రివేళలో నిద్రపోకుండా ఉండటం, హార్మోన్ సమస్యలు, గర్భనిరోధక సాధనాలు ఎక్కువగా వాడటం వల్ల సమస్యలు వస్తున్నాయి.

**ఆధునిక చికిత్సలతో సంతానం**

సంతానం కోసం చింతించే వారికి నేడు అత్యాధునిక వైద్య పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. సంతానం కోసం ఇన్‌విట్రో ఫెర్టిలైజేషన్ (ఐవీఎఫ్) విధానంలో భార్య అండాన్ని, భర్త శుక్రకణాల్ని ఇంక్యుబేటర్‌లో పెట్టి రెండు నుంచి ఐదు రోజుల్లో పిండం తయారయ్యాక ఇంజెక్షన్ రూపంలో భార్య గర్భంలో పిండాన్ని పెడతారు.. భర్త శుక్రకణాల సంఖ్య తక్కువగా ఉంటే ఇక్సీ విధానం ద్వారా, సంఖ్య జీరో అయితే టీసా పద్ధతి ద్వారా బీర్జాల్లో నుంచి సిరంజి ద్వారా వీర్యకణాలు తీసి ఫలదీకరణం చెందించి పిండాన్ని తయారు చేసి గర్భంలో పెడతారు. ఇంట్రాయుటైన్ ఇన్‌సెమినేషన్ (ఐయుఐ) విధానంలో భర్త శుక్రకణాలు తీసి ఇంజెక్షన్ రూపంలో భార్య గర్భంలో ప్రవేశపెడతారు. భార్య గర్భసంచి పిండం మోసే స్థితిలో లేకపోయినా, ఆమె ఆరోగ్యరీత్యా గర్భం రాకూడదని వైద్యులు నిర్ధారిస్తే సరోగసి ద్వారా (అద్దెగర్భం) సంతానం పొందవచ్చు.

### అందుబాటులో ఆధునిక వైద్యం



పిల్లల లేమితో బాధపడేవారికి నేడు అత్యాధునిక వైద్య పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. నూతన వైద్య విధానంలో సంతానలేమి సమస్యతో వచ్చిన వారు ఆస్పత్రిలో వైద్యం పొందిన పిదప సంతానం పొందారు. గుంటూరు నగరంలో అత్యాధునిక చికిత్సా పద్ధతులు అందరికి అందుబాటులోకి తీసుకొచ్చాం. ఆరోగ్య కరమైన పిల్లలు పుట్టేందుకు 23 ఏళ్ళనుండి 28 ఏళ్ళవయస్సు చాలా అనుకూలం. ఫోలిక్ యాసిడ్ గర్భం దాల్చేందుకు ముందుగానే మింగటం వల్ల మంచి ఫలితాలు ఉంటాయి.

– డాక్టర్ షమా సుల్తానా, ఐవీఎఫ్ నిపుణురాలు, గుంటూరు.

### గర్భం దాల్చగానే వైద్య పరీక్షలన్నీ చేయించాలి



గర్భం దాల్చిన 13 వారాలలోపు న్యూకల్ ట్రాన్స్ ల్యూసెన్సీ (ఎన్‌టీ) స్కాన్ చేయించాలి. డబుల్ మార్కర్ టెస్ట్, క్రోమోజోన్ ఎనాలసిస్ టెస్ట్, షుగర్ టెస్ట్, రక్తహీనత టెస్ట్ చేయించాలి. 18 వారాల నుంచి ఐరన్ మాత్రలు, ఫోలిక్ యాసిడ్, క్యాల్షియం మాత్రలు, మూడు, ఐదు నెలల్లో టీటీ ఇంజెక్షన్లు చేయించాలి. గర్భం దాల్చిన 20 నుంచి 22 వారాల్లోగా టీఫా స్కాన్ పరీక్ష చేయిస్తే గర్భంలో ఉండే బిడ్డ గుండె, తల, శరీరం, ఎముకల్లో ఎదుగుదల లోపాలను తెలుసుకోవచ్చు. 24 వారాల తరువాత బీపీ, షుగర్ పరీక్షలు చేయించాలి. 32 వారాలకు అల్ట్రాసౌండ్ స్కానింగ్, పెట్ స్కానింగ్, సిటీజీ స్కాన్ చేయించాలి.

–డాక్టర్ బూసిరెడ్డి దీప్తిరెడ్డి, స్త్రీప్రసూతి, సంతాన సాఫల్య వైద్య నిపుణురాలు, గుంటూరు.

### గర్భసంచి మార్పిడి ఆపరేషన్లు



గర్భసంచి సమస్యలు ఉండి పిల్లలు పుట్టని వారు, గర్భసంచి లేనివారు, నేడు ఆధునిక చికిత్స అందుబాటులోకి రావడంతో గర్భసంచి మార్పిడి ఆపరేషన్లు చేయించుకుని సంతానం పొందవచ్చు. పుట్టిన పిల్లలు చనిపోయిన వారికి సరోగసి (అద్దెగర్భం) ద్వారా ఐవీఎఫ్ విధానంలో సంతానం పొందవచ్చు. వందలో సుమారు 20 శాతం సంతాన లేమి సమస్యలతో బాధపడుతున్నారు.

– డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్, సీనియర్ ఐవీఎఫ్ స్పెషలిస్ట్, గుంటూరు.

# ఉద్యోగుల పాత్ర ఎనలేనిది

**అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్**



సంఘీభావం తెలియజేస్తున్న తెలగ, కాపు, బలిజ ప్రజాప్రతినిధులు

**నెహ్రూ నగర్:** కూటమి గెలుపులో ఉద్యోగుల పాత్ర ఎనలేనిదని మాజీ డిప్యూటీ స్పీకర్, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ పేర్కొన్నారు. తెలగ, బలిజ, కాపు ప్రజా ప్రతినిధులకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం, తెలగ, బలిజ, కాపు, తూర్పు కాపు ప్రభుత్వ ఉద్యోగస్తులు, పెన్షనర్ల జేఏసీ ఆత్మీయ సమావేశం జేఏసీ నిర్వాహకులు దాసరి రాము అధ్యక్షతన మంగళవారం రాత్రి వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథికి విచ్చేసిన మండలి బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటామని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏపీకి వరాల జల్లు కురిపించడంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కృషి ఎంతగానో ఉందన్నారు. ముందుగా శ్రీకృష్ణదేవరాయలు, కైవార శ్రీ యోగి నారాయణ యతీంద్ర తాతయ్య చిత్ర పటాలకు పూలమాలలు, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహాకవి మొవ్వ వృషాద్రిపతి పద్యాలతో అందరినీ ఆకట్టుకున్నారు. అనంతరం మద్రాసులో ఎలుగెత్తిన తొలి జాతీయ గొంతుక గాజుల లక్ష్మీ నరసు శెట్టి పుస్తకావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నిమ్మకాయల చిన రాజప్ప, జ్యోతుల నెహ్రూ, బడేటి రాధా కృష్ణ, వరపుల సత్యప్రభ, పంచకర్ల రమేష్, బొలిశెట్టి శ్రీనివాస్, ఆరని శ్రీనివాసులు, లోకం మాధవి, ఇతర ప్రజాప్రతినిధులు, హంపీ విరూపాక్ష పీఠాధిపతి శ్రీ గాంభిరానంద స్వామీజీ, సినీ నిర్మాత ఏఎం రత్నం, కాపు నేతలు పాల్గొన్నారు.

# పారిశుధ్య లోపం వల్లే వ్యాధుల తీవ్రత

**సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్**



మాట్లాడుతున్న జంగాల అజయ్‌కుమార్

**లక్ష్మీపురం:** గుంటూరు నగరంలోను పారిశుద్ధ్యం క్షీణించి డయేరియా, డెంగీ, మలేరియా లాంటి విష జ్వరాలు ప్రబలి ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ అన్నారు. స్థానిక కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో నగర సీపీఐ పార్టీ సమితి సభ్యుల విస్తృత సమావేశం నగర కార్యవర్గ సభ్యురాలు గుండెబోయిన లక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులకి అనేకసార్లు మొరపెట్టుకున్నా ఫలితం కానరాలేదని ఆరోపించారు. నూతనంగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి పైన అపరిష్కృతంగా ఉన్న సమస్యల పైన దృష్టి పెట్టాలన్నారు. అందుకు స్థానికంగా ఉన్న పార్టీ శాఖలు కదలి సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని చెప్పారు. కమ్యూనిస్టు పార్టీ ఉన్న ప్రతి ప్రాంతంలో ప్రజా సమస్యలు ఉత్పన్నమైన వాటి పరిష్కారానికి పార్టీ కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో మోడీ ప్రభుత్వం అత్యంత ప్రమాదకరంగా మారిందని, మతోన్మాద, కార్పొరేట్ అనుకూల విధానాలను అమలు జరుపుతూ దేశ సౌభ్రాతృత్వానికే ప్రమాదం వాటిల్లే విధానాలను అమలు జరుపుతున్నారని విమర్శించారు. దీనికి వ్యతిరేకంగా జరిగే పోరులో సీపీఐ నాయకులు, కార్యకర్తలు విరోచిత పాత్ర నిర్వహించాలన్నారు. సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ గుంటూరు నగర సమగ్ర అభివృద్ధి కోసం నగరంలోని పార్టీ శాఖలన్నీ పోరాట కార్యక్రమాలకు సిద్ధం కావాలని, నగరంలోని శాఖలన్నీ క్రియాశీలంగా పనిచేయాలన్నారు.

# జగ్జీవన్‌రామ్ చైర్ అభివృద్ధికి కృషి

**నూతన డైరెక్టర్ ఆచార్య పీజే రత్నాకర్**



ఆచార్య పీజే రత్నాకర్‌ను సన్మానిస్తున్న ఆచార్య వెంకటేశ్వర్లు

**ఏఎన్‌యూ:** యూనివర్సిటీలోని బాబూ జగ్జీవన్ రామ్ అధ్యయన కేంద్రం అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తానని నూతన డైరెక్టర్ ఆచార్య పొన్నెకంటి జోసఫ్ రత్నాకర్ తెలిపారు. బాబూ జగ్జీవన్‌రామ్ అధ్యయన కేంద్రం డైరెక్టర్‌గా నియమితులైన ఆయన గత కోఆర్డినేటర్ ఆచార్య కె.మధుబాబు నుంచి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. యూనివర్సిటీ దూరవిద్యాకేంద్రం డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు, పూలే, అంబేడ్కర్ అధ్యయన కేంద్రాల డైరెక్టర్లు ఆచార్య త్రిమూర్తిరావు, ఆచార్య అశోక్ కుమార్‌లు నూతన డైరెక్టర్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆచార్య రత్నాకర్ మాట్లాడుతూ బాబూ జగ్జీవన్ రామ్ అధ్యయన కేంద్రం ఏర్పాటు చేసిన లక్ష్యాల సాధనకు ప్రత్యేక ప్రణాళికతో కృషి చేస్తానన్నారు. జగ్జీవన్‌రామ్ ఆశయాలు, లక్ష్యాలపై విస్తృతంగా పరిశోధనలు జరిపించడంతోపాటు, ఆయన జీవిత ఘట్టాలు, అణగారిన వర్గాలకు చేసిన సేవలను సమాజానికి చేరువ చేస్తానని తెలిపారు. ఢిల్లీలోని బాబూ జగ్జీవన్‌రామ్ ఫౌండేషన్‌ను సంప్రదించి అధ్యయన కేంద్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానన్నారు. పూలే అధ్యయన కేంద్రం ప్రోగ్రామర్ బి.కోటేశ్వరరావు, పలువురు పరిశోధక, విద్యార్థి సంఘ నాయకులు, సిబ్బంది నూతన డైరెక్టర్‌కు అభినందనలు తెలిపారు.

# ఘనంగా బీఎంఎస్ ఆవిర్భావ దినోత్సవం



అరండల్‌పేట హెడ్ పోస్టాఫీసు వద్ద బీఎంఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న బి.రమేష్, మురళీకృష్ణ

**లక్ష్మీపురం:** భారతీయ మజ్దూర్ సంఘ (బీఎంఎస్) ఆవిర్భావ దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా పోస్టల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుపుకోవడం చాలా సంతోషదాయకంగా ఉందని బీఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి బి.రమేష్ అన్నారు. స్థానిక గుంటూరు అరండల్‌పేటలోని హెడ్ పోస్టాఫీసు వద్ద భారతీయ మజ్దూర్ సంఘ ఆవిర్భావ దినోత్సవాన్ని భారతీయ పోస్టల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ పోస్టుమెన్, ఎం.టి.ఎస్ గుంటూరు డివిజన్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా హెడ్ పోస్టాఫీసు ముందు జెండాను ఆవిష్కరించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1955 జులై 23న మధ్య ప్రదేశ్‌లోని భూపాల్‌లో బిఎంఎస్‌ను ప్రారంభిచారని గుర్తు చేశారు. ఈ బీఎంఎస్ 69 సంవత్సరాలు పూర్తి చేసుకుని 70వ సంవత్సరంలోకి అడుగు పెట్టిందని చెప్పారు. దేశంలోనే అతి పెద్ద కార్మిక సంస్థ అని ఈ సందర్భంగా తెలియజేశారు. పోస్టల్ బీఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి మురళీ కృష్ణ మాట్లాడుతూ బీఎంఎస్ ప్రజాహితం, శ్రామిక హితం, కార్మికహితంతో నడుస్తుందన్నారు.

బీఎంఎస్ దేశంలో అతి పెద్ద పేరు ప్రఖ్యాతలు, అనేక పోరాటాలు, సేవలు చేసిన సంస్థ అలాగే కేంద్ర ప్రభుత్వం చేత గుర్తించబడిన కార్మికుల సంస్థ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు కె.లోవారెడ్డి, జిల్లా కన్వీనర్ కృష్ణ, వెంకటేశ్వర్లు, మురళీకృష్ణ, కె.కిరణ్, జి.చంద్రశేఖర్, పి.నాగుల్ మీరా తదితరులు పాల్గొన్నారు.

# అముక్తమాల్యదపై ఆధ్యాత్మిక ప్రవచనం



మాట్లాడుతున్న శ్రీరంగనాయకి

**నగరంపాలెం:** స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై మంగళవారం అముక్తమాల్యదపై ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించారు. ఆలయ అధ్యక్షులు సీహెచ్. మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. డాక్టర్ శ్రీరంగ నాయకి మాట్లాడుతూ యామునాచార్యుడు తన కుమారునకు బోధించిన రాజనీతిలో రాజుగా కృష్ణ దేవరాయల సొంత గొంతుక వినిపిస్తుందని అన్నారు. ఈ రాజనీతి విభాగం సంక్లిష్టమైన నిర్మాణంతో పలు సంప్రదాయాల మేలు కలయికగా కనిపిస్తుందని వివరించారు.

# తెలుగు సాహిత్యానికి దాశరథి సేవలు ఎనలేనివి

**అవగాహన సంస్థ ఆధ్వర్యంలో దాశరథి శతజయంతి వేడుకలు**



**లక్ష్మీపురం:** ప్రజాఉద్యమాన్ని ఉద్వేగాన్ని ఉత్సాహాన్ని ఉల్లాసాన్ని కవితాక్షరాలలో పొదిగి తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవలు చేసిన మహాకవి దాశరథి కృష్ణమాచార్యులు అని ప్రముఖ కవి కె.జయకుమార్ అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సాహితీవేత్త దాశరథి కృష్ణమాచార్యులు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వ కవుల సంప్రదాయ పద్య సారాబాన్ని కొనసాగిస్తూనే ఆధునిక నవీన వచనానికి దారులు వేస్తునే మరో వైపు ప్రపంచ సాహితీ పొకడలలోని ప్రక్రియలను తెలుగులోకి తీసుకువిచ్చి వాటికి సాహిత్య ప్రతిపత్తిని కల్పించిన ప్రయోగశాలీ దాశరథి అని అన్నారు. సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, సంగీత విద్వాంసుడు వి.ఎస్.ఎస్.మల్లేశ్వరరావు మాట్లాడుతూ అగ్నిధారా, రుద్రవీణ, పూల పాటలు వంటి అనేక పద్య గేయ కావ్యాలు ఎప్పటికీ పాఠకులకు కళ్లముందు మెదులుతునే ఉంటాయన్నారు. అనంతరం సంస్థ సభ్యులు, సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు నివాళులర్పించి ప్రసంగించారు.

### ప్రతిభ చాటిన విజ్ఞాన్ డిగ్రీ కళాశాల విద్యార్థులు

**గుంటూరు రూరల్ :** ప్రతి విద్యార్థికి ఉపాధి కల్పనే లక్ష్యంగా తమ కళాశాల కృషి చేస్తోందని విజ్ఞాన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ తెలిపారు. మంగళవారం పెదపలకలూరులోని కళాశాలలో లియోరా డిజిటల్ అమిగోస్ కంపెనీ ఆధ్వర్యంలో ఇంటర్న్‌షిప్‌కు ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అనురాధ మాట్లాడుతూ నైపుణ్యత కలిగిన విద్యా విధానం, ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంతో తమ కళాశాల విద్యార్థులు ఉపాధి పొందగలుగుతున్నారన్నారు. ప్లేస్‌మెంట్ అధికారి గోపాలకృష్ణ, ఇన్‌చార్జి రామిరెడ్డిలు మాట్లాడుతూ లియోరా డిజిటల్ అమిగోస్ సంస్థలో ఇంటర్న్‌షిప్ కోసం ప్రతిభ కలిగిన ఎనిమిది మంది విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులను సంస్థ డైరెక్టర్ జె.బోయస్‌రాజు, ఆపరేషన్స్ మేనేజర్ షేక్ ఇమ్రాన్, పొలిశెట్టి శేషసాయి, కళాశాల అధ్యాపకులు అభినందించారు.

### సైనికుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు



**లక్ష్మీపురం:** విద్యార్థులలో నైపుణ్యతను వెలికితీసేందుకు ప్రధానంగా ఆర్మీ జవానుల కుటుంబాలలో పదోతరగతి, ఇంటర్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు స్కాలర్ షిప్‌లను అందజేయడం జరిగిందని ఎన్‌సీసీ కల్నల్ సజల్ కాంతిదాస్ అన్నారు. స్థానిక శ్యామలానగర్ ఎన్‌సీసీ కార్యాలయంలో మంగళవారం స్కాలర్ షిప్‌ల పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్మీ సైనికుల పిల్లల్లో నూతన ఉత్తేజం, ఉత్సాహం కల్పించేందుకు ఈ స్కాలర్ షిప్‌లను అందజేయడం జరుగుతుందన్నారు. అదే విధంగా ఈ ఏడాది 142 మంది విద్యార్థులకు ఈ ప్రతిభ పురస్కారాలను అందచేసినట్లు ఆయన చెప్పారు. పదో తరగతి, ఇంటర్‌లో ప్రతిభకనబర్చిన సైనికుల పిల్లలకు ప్రతి విద్యార్థికి రూ.5 వేలు అందజేశామని చెప్పారు. రాబోయే రోజుల్లో ప్రతిభ కనబర్చిన ప్రతి ఒక్కరికీ ప్రతిభా పురస్కారాలను అందజేసేలా ప్రణాళికలు రూపొందించడం జరిగిందన్నారు.

### కరాటేలో సత్తా చాటిన మహేష్



**గుంటూరు ఎడ్యుకేషన్:** ఛాలెంజర్ కప్ ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్‌లో స్టెమ్ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థి దూమాల మహేష్ ఉత్తమ ప్రతిభ చూపి, ప్రథమ బహుమతి సాధించినట్లు కోచ్ కె. సురేష్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఫిరంగిపురం మండలం యర్రగుంట్లపాడుకు చెందిన విద్యార్థి మహేష్ కరాటేలో అత్యుత్తమ నైపుణ్యం ప్రదర్శించి, ప్రథమ స్థానంలో నిలవడం గర్వకారణమన్నారు. ఈసందర్భంగా విద్యార్థి మహేష్‌ను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారని తెలిపారు.